ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 6 డిసెంబరు 2025

'పరకామణి'తో పరాచకాలా..!

పరకామణి దొంగతనాన్ని చాలా చిన్నదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తిరుపతిలోని కూటమి నేతలు శుక్రవారం ఆయనపై ధ్వజమెత్తారు. 'పరకామణి'తో పరాచకాలేంటి జగన్ అంటూ ధ్వజమెత్తారు. ఎవరేమన్నారంటే..

- తిరుపతి/తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి

గజదొంగకు చిన్నదే కావచ్చు



తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.వేలకోట్లు సంపాదించిన గజదొంగకు పరకామణి చోరీ చిన్నదే కావచ్చు. క్రిస్టియన్‌గా శ్రీవారి దర్శనానికి వెళితే ఒక్కసారి కూడా డిక్లరేషన్‌పై సంతకం పెట్టని వ్యక్తికి ఇది చిన్నదే కావచ్చు. కానీ, కోట్లాదిమంది హిందువులకు మాత్రం ఇది పెద్ద విషయమే.

- పట్టాభి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్

ఆర్థిక నేరస్థుడికి ఇదేమి లెక్క?



వైసీపీ నేత జగన్మోహన్ రెడ్డి మాటలకు శ్రీవారి భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పెద్ద ఆర్థిక నేరస్థుడికి పరకామణి దొంగతనం కేసు తక్కువే కదా! శ్రీవారి చెంత దాదాపు రూ100కోట్లు నొక్కేస్తే చాలా చిన్న విషయమా? కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీస్తారా? పరకామణి కేసులో నలుగురు తోడు దొంగలు ఉండారని ఆధారాలతో సహా చూపించినా తనని ఒక్కరినే విచారిస్తున్నారని భూమన కరుణాకరరెడ్డి అనడం విడ్డూరంగా ఉంది.

- సుగుణమ్మ, ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్

చర్చిలో జరిగితే ఇలాగే స్పందిస్తారా?



రూపాయి దొంగలించినా అది పవిత్రమైన స్వామి సొత్తు. అది మీ దృష్టిలో చిన్న చోరీనా? లక్షలకోట్లు కొల్లకొట్టి బెయిల్‌పై ఉన్న మీకు అదిచిన్నదిగానే కావచ్చు. ఏసుప్రభు దగ్గర జరిగివుంటే ఇదేవిధంగా స్పందన ఉండేదా? కోట్లాదిమంది హిందువులు బాధపడేవిధంగా మాట్లాడారు. పరకామణి అంశంలో ప్రజాభిప్రాయానికి వెళ్లే దమ్ముందా?

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ సభ్యుడు

చిల్లర కేసుగా మాట్లాడతావా?



రూ.వందల కోట్లు దోచేసిన పరకామని కేసును చిల్లర కేసుగా మాట్లాడటం ఏంటీ? స్వామివారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడతావా? నీ బంధువు భూమన, మీ బాబాయి వైవీ, నీ వాళ్ల ధనంజయరెడ్డి, ఎస్వీ పరమేశ్వర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి కాజేసిన డబ్బును అప్పనంగా పంచేసుకుంటే.. నీవేమో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తావా?

- రవినాయుడు, శాప్ ఛైర్మన్

ఐఏఎస్ అధికారులంటే లెక్కలేదా?



సీఎంగా పనిచేసిన జగన్ రెడ్డి.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడు, వీడు అని పలకడం దారుణం. అందులోనూ యాదవ కులానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి కృష్ణయ్యను తూలనాడారు. యాదవులందరికీ క్షమాపణ చెప్పాలి. వైసీపీ హయాంలో శ్రీవారి ప్రసాదాల్లో కల్తీ జరగడం వల్లే నాణ్యత లోపించిందని ఎన్నికల సభల్లో చెప్పాను. ఇప్పుడది బహిర్గతమైంది.

- నరసింహ యాదవ్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్

శ్రీవారి కానుకలంటే లెక్కలేదా?



దేశ నలుమూలల నుంచి నిత్యం వచ్చే లక్షలాదిమంది భక్తులు శ్రీవారికి కానుకలు సమర్పిస్తుంటారు. అలాంటి పవిత్రమైన పరకామణి లెక్కింపులో దొంగతనం జరిగితే జగన్‌రెడ్డి లెక్కలేకుండా మాట్లాడతారా? 11 సీట్లు వచ్చినప్పుడే మానసిక పరిస్థితి దెబ్బతింది. ఇప్పుడది నిజమని స్పష్టమైంది. హిందువులకు క్షమాపణ చెప్పాలి.

- ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ మేయర్, తిరుపతి

ఏనుగులు తిన్నోడికి పీనుగులు ఒక లెక్కా



లక్షల కోట్లు దోచేస్తేనే జగన్ దృష్టిలో దొంగ. ఏనుగులు తిన్నోడికి పీనుగులు ఒక లెక్కా. పరకామణి దొంగను ఆయన అయ్యో పాపం అంటున్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోండి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడు, వీడు అంటారా? వాళ్లేమన్నా తాడేపల్లి ప్యాలెస్‌లో చదువుకున్నారా? వారికి క్షమాపణలు చెప్పాలి. జగన్‌పై వారు కేసులు పెట్టాలి. జగన్ మాటల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

- కిరణ్ రాయల్, జనసేన నేత

మమ్మల్ని దోషులుగా చిత్రీకరించడానికే..



మా హయాంలో ఉన్న బోర్డు సభ్యులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. వారినెందుకు విచారణకు పిలవలేదు. మమ్మల్ని దోషులుగా చూపడానికే అధికారులు పనిచేశారు. రవికుమార్ తన ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసి టీటీడీకి ఇస్తే.. అప్పటి అధికారులకు ఏం సంబంధం? రవికుమార్‌వి అవినీతి ఆస్తులైతే ఎందుకు అతడికి తిరిగి ఇవ్వలేదు. టీటీడీలో ఓ రూల్ ఉంది. డోనర్స్ పూర్వాపరాలు తెలుసుకోదు.

- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్

2,220 పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0

- భాగస్వాములైన 2.63 లక్షల మంది

తిరుపతి(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 3,370 విద్యా సంస్థల్లో శుక్రవారం పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం) 3.0 జరిగింది. ఇందులో 2,63,389 మంది భాగస్వాములయ్యారు. విద్యా విధానాన్ని మరింతగా బలోపేతం చేసి, విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాలు సాగాయి. వరదల కారణంగా 26 పాఠశాలలు మినహా మిగిలిన 2,220 పాఠశాలలో వేడుకగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో 1,15,683 మంది విద్యార్థులు, 22,789 తల్లిదండ్రులు, 2,547 మంది ప్రజా ప్రతినిధులు, 2,485 మంది అధికారులు, 2,445 మంది ఓల్డ్ విద్యార్థులు, ఇతరులు 4,121 మంది మొత్తం 2,63,389 మంది భాగస్వాములయ్యారు. ఇక జిల్లాలోని ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా పీటీఎం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



గత నెలలో విజయవాడలో జరిగిన మాక్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా పాల్గొన్న ఎస్వీ జేఎన్ఎం విద్యార్థి భవ్యశ్రీని సన్మానిస్తున్న పట్టాభి తదితరులు

కార్యక్రమాలు అనేకం.. ఎంతో ఉపయుక్తం

పీటీఎం కార్యక్రమాల్లో భాగంగా పేరెంటింగ్ సెషన్లను నిర్వహించారు. విద్యార్థులపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్ వాడకంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, తద్వారా మంచి విద్యార్థులుగా వారిని తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. చివరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు చూపించి వివరించారు.

ఆకట్టుకున్న ప్రతిభా ప్రదర్శనలు

కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు అనేక ప్రతిభా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేసి సైన్స్, మ్యాథ్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్ ప్రాజెక్టులు, డిజిటల్ ల్యాబ్ పరికరాల ప్రదర్శన, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ ఫ్రీ కాన్సెప్ట్ మోడళ్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మోడళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లైబ్రరీ బుక్స్ ప్రదర్శనలు, ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో భాగంగా అగ్రికల్చర్, ఐటీ, ఆటోమొబైల్స్, వెల్‌నెస్, హెల్త్‌కేర్ తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. సంగీత, నృత్య కార్యక్రమాలతో అలరించారు.

ఎవరు ఎక్కడెక్కడ?

తిరుపతి నగరం దొడ్డాపురం ఎంసీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, గూడూరు జడ్పీటీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ కళ్యాణచక్రవర్తి, పాకాల మండలం దామలచెరువు జడ్పీహెచ్ఎస్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ, చిల్లకూరులో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సత్యవేడు ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ పాఠశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, రేణిగుంటలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వడమాలపేట మండలం పత్తిపత్తూరులో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తిరుపతి అర్బన్ ఎస్టీ లేఔట్‌లోని ఎస్వీజేఎన్ఎం పాఠశాలలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం, జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి టీపీ ఏరియా టీపీపీఎం స్కూల్‌లో మేయర్ శిరీష, ఎంజీఎం హైస్కూల్‌లో ఇన్‌చార్జి జేసీ, కమిషనరు మౌర్య, ఎస్‌జీ కాలనీ ఎంసీహెచ్ఎస్‌లో ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాలొద్దు



'బాల్య వివాహాలవల్ల పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు నాశనమవుతాయి. అతిగా మొబైల్ వాడటంతో నష్టాలే ఎక్కువ. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ప్రమాదాలపై ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలి' అని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. తిరుపతి చిన్నబజారు వీధిలోని బాలిక ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

బ్యాంకర్లకు ఆదర్శం 'గురుగ్రామ్'

- డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి
- ఖాతాదారులు మోసపోకుండా చూడాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయి. డిజిటల్ అరెస్టులు, ఇతర బెదిరింపులతో రూ.లక్షలు కాజేస్తున్నారు. వీటి విషయంలో బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండి.. ఖాతాదారులు నష్టపోకుండా చూడాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది. 'గురుగ్రామ్' ఘటనను ప్రస్తావిస్తూ బ్యాంకర్లకు ఎస్పీ సుబ్బరాయుడు పలు సూచనలు చేశారు. ఇంతకీ గురుగ్రామ్‌లో ఏం జరిగిందంటే.. అక్కడి యాక్సిస్ బ్యాంకులోని ఓ ఖాతా నుంచి అనుమానాస్పదంగా అధిక మొత్తంలో నగదు బదిలీలు జరిగాయి. దీనిని గమనించిన బ్రాంచ్ రిలేషన్‌షిప్ మేనేజర్ సబర్వాల్.. వెంటనే రిసీవింగ్ బ్యాంకులను అప్రమత్తం చేశారు. లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేశారు. సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారమిచ్చి లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. ఈ చర్యతో ఆ ఖాతా నుంచి వెళ్లిన రూ.64 లక్షలను ఆపగలిగారు. తదుపరి లావాదేవీలు ఆగడంతో ఆ సీనియర్ సిటిజన్‌కు రూ.6 కోట్ల నష్టం తప్పింది. ఇలా బ్యాంకు మేనేజరు అప్రమత్తతో 'డిజిటల్ అరెస్టు' పేరిట జరుగుతున్న మోసాన్ని అరికట్టారు. దీనిపై ఆ ఒంటరి కస్టమర్‌ను పలుమార్లు సంప్రదించారు. ఈ ఘటనను ఆదర్శంగా తీసుకుని బ్యాంకర్లు.. అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ కోరుతోంది.

మోసగాళ్ల పద్ధతులు

పోలీస్, సీబీఐ, ఎన్ఐఏ, కస్టమ్స్ పేరిట వాట్సాప్ కాల్ చేయడం. మనీ ల్యాండరింగ్, ఇతరత్రా పేరిట డిజిటల్ అరెస్టులని బెదిరిస్తారు. దర్యాప్తు కోసమని పెద్ద మొత్తాలను ప్రత్యేక ఖాతాలకు బదిలీ చేయించుకుంటున్నారు. ఎక్కువగా సీనియర్ సిటిజన్లపైనే మోసగాళ్ల దృష్టి పెడుతున్నారు.

బ్యాంకర్లు.. ఏం చేయాలంటే

బ్యాంకు మేనేజర్లు, అధికారులు, ఫ్రంట్ డెస్క్ సిబ్బంది అధిక లావాదేవాలను పర్యవేక్షించాలి. సీనియర్ సిటిజన్ల ఖాతాలు, డార్మెంట్ అకౌంట్లు, కొత్తగా యాక్టివ్ అయిన ఖాతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అనుమానాస్పద లావాదేవీలపై ఇంటర్వెన్షన్ ప్రొటోకాల్ పాటించాలి. అవసరమైతే తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టాలి. పెద్ద మొత్తాల బదిలీలపై కస్టమర్‌ను సంప్రదించాలి. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారమివ్వాలి. లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేయించాలి. డిజిటల్ అరెస్టు స్కామ్‌లు, ఫేక్ కాల్స్ ప్రమాదాలపై కస్టమర్లకు అవగాహన కల్పించాలి. ఇలాంటి చర్యల వల్ల సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు బ్యాంకు మేనేజర్లకు సూచన చేశారు.





డ్రోన్ ఎగురవేసిన శుభం కండేల్‌వాల్ - శిలాతోరణంపై డ్రోన్

శిలాతోరణం వద్ద డ్రోన్

- అదుపులో ఇద్దరు

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో డ్రోన్ ఎగరేసిన ఇద్దరు భక్తులను టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద వద డ్రోన్ ఎగురవేసి వీడియోలు తీస్తున్న జైపూర్‌కు చెందిన ఎస్ఆర్ఐ భక్తుడు శుభం కండేల్‌వాల్ అలియాస్ సర్వలక్షణ్‌దాస్, ఒంగోలుకు చెందిన భానుసుందర్ అలియాస్ అర్జున్ బంధుదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇస్కాన్ భక్తులమని, హిందూ ధర్మప్రచారం కోసమే ఈ ప్రయత్నం చేశామని వారు వివరణ ఇచ్చారు. వీరిని విజిలెన్స్ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అలిపిరి తనిఖీల్లో అవరోధం లేకుండానే వీరు తిరుపతి నుంచి బస్సులో డ్రోన్‌తో రావడం విశేషం.

16న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

- వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లపైనే ప్రధాన చర్చ

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 16న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పదిరోజుల పాటు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలపై చర్చ జరుగనుంది. అలాగే టీటీడీ కొనుగోళ్లపై కొన్ని నిర్ణయాలు తీసుకోన్నారు. జనవరి 25న జరుగనున్న రథసప్తమికి చేపట్టాల్సిన ఏర్పట్లపై కూడా చర్చించనున్నారు. బోర్డ్ సెల్ విభాగం అంజెండా అంశాలను సిద్ధం చేస్తోంది.

9 నుంచి పులుల గణన

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి డివిజన్ పరిధిలోని 92 బీట్లలో ఈనెల 9వ తేదీ నుంచి పులులు లెక్కించనున్నారు. నాలుగేళ్లకు ఒకసారి దాదాపు 40 రోజుల పాటు మూడు దశల్లో ఈ గణన జరుగుతుందని తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ● మొదటి దశలో ఎనిమిదిరోజుల పాటు పెద్దపులి, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, ఏనుగులు, జింకలు, ఇతర జంతువులను లెక్కిస్తారు. మొదటగా ప్రతిబీట్‌లో ఒక బీట్ ఆఫీసర్, ఇద్దరు వాచర్లు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఐదు కిలోమీటర్లు పాటు నడుచుకుంటూ వెళుతు మాంసాహార జంతువుల ఆనవాళ్లను మూడు రోజుల పాటు కనుక్కుంటారు. అనంతరం రెండు రోజుల పాటు డేటా ఎంటర్ చేస్తారు. ఆ తర్వాత మూడు రోజులు శాఖాహార జంతువులు, వాటి ఆనవాళ్లు, అడవుల పరిస్థితిని పరిశీలిస్తారు. మరుసటి రోజు డేటా మొత్తాన్ని నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌కు పంపుతారు. ఎంస్ట్రైప్స్ మొబైల్ యాప్స్ ద్వారా డేటా సేకరిస్తారు. ● రెండో దశలో కెమెరాలను ఏర్పాటు చేసి.. గుర్తిస్తారు. ● మూడో దశలో వన్యప్రాణుల పాదముద్రలు, గోర్లు, వెంట్రుకలు, ఇతర శరీర ఆనవాళ్లను పరిశీలించి డేటా సేకరిస్తారు.

మరోసారి వాన ముప్పు

- 9న భారీ వర్ష సూచన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండం కారణంగా జిల్లాలో ఈనెల 9న మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. తదుపరి భారీ వర్షాలకు జిల్లా యంత్రాంగం సమయాత్తం అవుతోంది. శుక్రవారం ఉదయం 11 నుంచి ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదు అయిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చిట్టమూరు 87.8మి.మీ., బాలాయపల్లి 56.4, వాకాడు 51.6, గూడూరు 50.6, చిల్లకూరు 42.4, సూళ్ళూరుపేట 42.2, కోట 38.8, డక్కిలి 37.2, కేవీబీపురం27.6 మి.మీ. వర్షపాతం నమోదు అయింది.



ఎనిమిది రోజులు తర్వాత మబ్బులు కాస్త తొలగి నీలి రంగు ఆకాశం కనిపించింది. మబ్బుల వెనుక నుంచి సూర్యుడు దోబూచులాడాడు. కాసేపు ఎండ కాయడంతో ప్రజలు సంతోషంగా కనిపించారు. తిరుమలలో వాన జల్లులతో చలి గాలులతో షెడ్ల కింద ముడుక్కుంటున్న భక్తులు శుక్రవారం పగలు ఆలయం ముందు బహిరంగ ప్రదేశంలో కూర్చుని కనిపించారు. నులి వెచ్చని ఎండకు కాగుతూ గడిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పది ఇండిగో విమానాల రద్దు

- సాంకేతిక సమస్యతో చెన్నైలో దిగిన విమానం

రేణిగుంట డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, విశాఖపట్నం, ముంబై, విజయవాడ నుంచి శుక్రవారం తిరుపతి విమానాశ్రయానికి రావాల్సిన పది ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ఇక, హైదరాబాద్ నుంచి ఉదయం 10.35 గంటలకు తిరుపతికి ప్రయాణికులతో బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో చెన్నైలో ల్యాండ్ అయింది. అలాగే, హైదరాబాద్ నుంచి 8.55 గంటలకు వచ్చిన స్పైస్ జెట్ విమానం వాతావరణం అనుకూలించక 10 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టి 9 గంటలకు దిగింది. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15 గంటలకు రావాల్సిన ఎయిర్ అలయన్స్ విమానం అరగంట ఆలస్యంగా చేరుకుంది. శివమొగ్గ నుంచి స్టార్ ఎయిర్ 40 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది.

కళాశాలలో తరగతి గదుల ప్రారంభం



చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో దాతల సాయంతో నిర్మించిన తరగతి గదులను ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. ఏసీటీఎస్ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రస్తుత, పూర్వ అధ్యాపకులు అందించిన రూ.15 లక్షలతో కళాశాలలో రెండు తరగతి గదులను నిర్మించారు. ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, దాత ఏసీటీఎస్ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్ పాల్గొన్నారు.

కారు ఢీకొని లగేజీ ఆటోడ్రైవర్ మృతి



మృతిచెందిన సురేష్

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లగేజీ ఆటోడ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డుకు చెందిన మునిరత్నం కుమారుడు సురేష్(39) లగేజీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఎ.రంగంపేట సమీపంలో రోడ్డు దాటుతుండగా చిన్నగొట్టిగల్లు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు ఢీకొంది. తీవ్రగాయాలైన సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఓటుతో సమర్థులైన పాలకులను ఎన్నుకోండి



నడింపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రాయుధం లాంటి ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ భక్తవత్సలం అన్నారు. మండలంలోని ఎం.కొత్తపల్లె(నడింపల్లె)ను అగరాల వద్దవున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. శుక్రవారం గ్రామ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. డబ్బు విలువ, ఓటు విలువ తెలుసుకో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేష్, మల్లేష్, భరత్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయకుమార్, ల్యాబ్ అసిస్టెంట్ లోకేష్ పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణాలకు రక్షణ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ భక్తవత్సలం

రామచంద్రాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ భక్తవత్సలం అన్నారు. అర్‌సీపురం ప్రధాన కూడలి వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహంచారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా విధించి, కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే 9440796731కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, ధనంజయులు, ఓబులురెడ్డి, రాజశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి కృషి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న చిన్నబాబు

రామచంద్రాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిన్నబాబు అన్నారు. శుక్రవారం కుప్పంబాదూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. మౌలిక వసతుల గురించి వైద్యాధికారులు తేజేశ్వరి, పూర్ణను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం వైద్యబృందం ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి దర్శనం



చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

చంద్రగిరి

మానసిక ఆరోగ్యంపై అవగాహన

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఏడుకొండలు మాట్లాడుతూ రోజూ పిల్లలతో తల్లిదండ్రులు కొంతసేపు మాట్లాడటం ద్వారా వారి ఆలోచనలను అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కేవీఎస్ కుమార్, ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

దారి ఆక్రమించి వేధిస్తున్నారు..



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రవి

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొలంలోకి వెళ్లనీయకుండా దారి ఆక్రమించి వేధిస్తున్నారంటూ మండలంలోని కందులవారిపల్లి పంచాయతీ మామిడిమానుగడ్డ గ్రామానికి చెందిన రవి శుక్రవారం తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు ఫిర్యాదు చేశాడు. తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన భీమవరం లెక్కదాఖల సర్వే నెంబరు 253లో సుమారు 56 సెంట్లు, 251-3ఎ‌లో 21 సెంట్ల వ్యవసాయ భూమి ఉందన్నారు. భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, గ్రామానికి చెందిన మారుపూరి చెంగల్రాయ నాయుడు, కుమార్‌చౌదరి దారిని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇప్పుడు తన పొలంలోకి వెళ్లడానికి దారి లేకుండా పోయిందని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయాడు. స్పందించిన తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై శిక్షణ

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 15వ తేదీ నుంచి నెల రోజులు పురుషులకు, మహిళలకు ఉచితంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంపై అవగాహన

తిరుపతిరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల వెలుగు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేక ఉద్యమంపై మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ.. తమపిల్లలు గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా తల్లులు జాగ్రత్త వహించాలని సూచించారు. తిరుపతిని మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఉంచుకుందామని ప్రతిజ్ఞ బూనారు. ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, వెలుగుసమాఖ్య కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ



విద్యార్థులతో మాట్లాడుతున్న దాత బైరెడ్డి భానుప్రకాష్

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొంగరవారిపల్లె, నరసింగాపురం ఉన్నత పాఠశాలలకు దోర్నకంబాలకు చెందిన బైరెడ్డి భానుప్రకాష్ శుక్రవారం 5 చొప్పున కంప్యూటర్లు వితరణ చేశారు. ల్యాబ్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేయాలన్న ఆలోచనతో కంప్యూటర్లు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌బాబు, ఎం.కొంగరవారిపల్లె హెచ్‌ఎం భాస్కర్ నాయుడు, దోర్నకంబాల హెచ్‌ఎం జగదీష్ ప్రసాద్, ఉపాధ్యాయులు అమరనాథ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

మందుబాబుల కిక్కు దిగుతోంది

● 22 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మందు తాగి వాహనాలు నడుపుతున్న వారి కిక్కు దిగుతోంది. గతంలో రూ.రెండు వేలు అపరాధం ఉండగా.. ఇప్పుడు రూ.పది వేలకు పెంచారు. ప్రతిచోటా తరచూ బ్రీత్ అనలైజర్లతో చెక్‌చేసి జరిమానా విధిస్తున్నా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో మందుబాబుల్లో మార్పు కనిపించడం లేదని డీఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు. ఈ క్రమంలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో శుక్రవారం 22 మందిని న్యాయమూర్తి సంధ్యారాణి ఎదుట హాజరు పరచగా, రూ.పది వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇక, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు చేస్తున్న మరో 16 మందికి రూ.500 చొప్పున జరిమానా విధించారు..

పాఠశాలల అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టపరచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన విద్యాబోధన ఉందని, పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. పాఠశాలలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. కాగా, మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ - టీచర్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో వాసుదేవరావ్, ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, సింగిల్ విండో చైర్‌పర్సన్ కె.సావిత్రి, మాజీ ఎంపీపీ చాముండేశ్వరి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎస్ కుమార్

చంద్రగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని డీఈవో కేవీఎస్ కుమార్ అన్నారు. శుక్రవారం చంద్రగిరి పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల ప్రగతిని టీచర్లు తల్లిదండ్రులకు తెలియజేస్తూ వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష పథక సంచాలకులు గౌరీశంకర్ మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో తమవంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. వివిధ రకాల పుస్తకాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాలికలు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారులు ఎస్.లలితకుమారి, కేభాస్కర్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

భాకరాపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్లు చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ అన్నారు. మండలంలోని చిన్నగొట్టిగల్లు, రంగన్నగారిగడ్డ, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్, ప్రిన్సిపాల్ విశ్వనాథనాయక్, హెచ్‌ఎంలు మృదులాదేవి, శివకుమార్, చంద్రశేఖర్, సీఆర్‌పీలు ప్రవీణ్‌కుమార్, మధు, శ్రీరాములు, పాఠశాల చైర్మన్లు కరీముల్లా, పార్వతి, టీడీపీ నేతలు మోహన్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, చోటాసాహెబ్, ముత్యాలు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెంలో పేరెంట్, టీచర్స్ మీటింగ్



మాట్లాడుతున్నఎంఈవో బాలసుబ్రమణ్యం

ఎర్రావారిపాళెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 56 పాఠశాలల్లో పేరెంట్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులకు వారి పిల్లల ఎఫ్ఏ-1, 2 పరీక్షల ఫలితాల పత్రాలు అందజేసి ముఖాముఖి చర్చించారు. ఎంఈవో బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

9న రైల్వే జీఎం రాక

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతికి ఈ నెల 9న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ రానున్నారు. తిరుపతిలో షిర్డీకి ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ రైలు (17425) ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. కాగా, ఈ రైలు ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు షిర్డీ చేరుకొంటుంది. అదే రోజు రాత్రి 7.35 గంటలకు సాయినగర్‌లో బయలుదేరి బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మార్కండేయనాయుడు

రామచంద్రాపురం, డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులు కష్టపడి చదివి విజ్ఞానాన్ని పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఎంఈవో మార్కండేయ నాయుడు అన్నారు. మండలంలోని అనుపల్లి, నెత్తకుప్పం, ఎన్‌ఆర్ కమ్మపల్లి, కుప్పంబాదూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎంపీడీవో పులి రామ్‌సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లలితకుమారి, సునీత, స్వజనకుమారి, సర్పంచ్ వేణుగోపాల్‌నాయుడు, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ హబీబూన్, దాతలు హనుమంత నాయుడు, దామోదర్ నాయుడు, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్‌నాయుడు, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్య లైబ్రరీ సైన్స్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : ఎస్వీయూ దూరవిద్యా లైబ్రరీ సైన్స్ బీఎల్ఐఎస్‌సీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మన బడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలు పొందుపర్చినట్టు పరీక్షల డీన్ సురేంద్రబాబు, సీఈ డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

రూరల్‌లో ఘనంగా పేరెంట్ టీచర్స్ సమావేశం





ఓటేరు జెడ్పీ హైస్కూల్లో ఎంఈవో-1 పద్మజ, టీచర్లు, తల్లిదండ్రులు - వీఆర్‌ఎన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో సమావేశం

తిరుపతిరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని 10 ఉన్నత, 45 ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం(మెగా పీటీఎం) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ప్రాంగణాలను రంగవల్లులతో తీర్చిదిద్దారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాప్రగతిని గురించి టీచర్లని అడిగి తెలుసుకున్నారు. సమ్మేటివ్-1, ఫార్మేటివ్-1,2లో విద్యార్థులు సాధించిన మార్కులను హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డుల రూపంలో తల్లిదండ్రులకు అందజేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్‌లో టీడీపీ ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి హాజరై విద్యా ప్రగతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, భాను, రాజశేఖర్, ముఖేష్‌రెడ్డి, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఎన్ స్కూల్‌లో..

తిరుపతిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలోని వీఆర్‌ఎన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో రాజు అలెన్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల విద్యాప్రగతిని తెలుసుకున్నారు. పాఠశాల నిర్వాహకులు చమర్తి లోకేష్‌రాజు, శ్రావణ్‌కుమార్ అగర్వాల్, టీచర్లు పాల్గొన్నారు.

14నుంచి ఇంధన పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఇంధన పరిరక్షణపై ఈనెల 14 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ శుక్రవారం తెలిపారు. తొలి రోజున ప్రభుత్వ కార్యాలయాల వద్ద హోర్డింగ్‌లు, కరపత్రాలు పంపిణీ, తిరుపతిలో 14, 15 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్, 15న విద్యార్థులు, ఉద్యోగులు, వినియోగదారులతో ర్యాలీ, 16న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు ఇంధన పరిరక్షణ-ఆవశ్యకతపై క్విజ్, వక్తృత్వపు పోటీలు, 17న ఆధునిక సాంకేతికతతో స్మార్ట్ వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా వ్యవస్థపై కళాశాల విద్యార్థులకు వర్క్‌షాపు, 18న స్వయంసహాయక బృందాల రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో వర్క్ షాపు నిర్వహిస్తామన్నారు. 19న వ్యవసాయ, ఆక్వా విద్యుత్తు వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కాగా, ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే 9, 10 తరగతుల విద్యార్థులు తమ పేరు, చిరునామా, మొబైల్ నెంబర్లు, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలను తమ వాట్సాప్ నెంబరు 87124 80430కు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పంపాలని సూచించారు. ఇంధన పరిరక్షణ అంశంపై విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో రెండు నిమిషాల నిడివి గల వీడియోను వాట్సాప్‌లో పై నెంబరుకు పంపాలన్నారు.

వర్షాలకు కుళ్లిపోయిన పశుగ్రాసం



పొలాల్లో కుళ్లిపోతున్న వరి గ్రాసం

రామచంద్రాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్ల నేపథ్యంలో జడివానకు పొలాల్లో పశుగ్రాసం కుళ్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అక్టోబరులో వరి, వేరుశనగ పంటల నూర్పిడులు జరిగాయి. అప్పటి నుంచి వర్షాలు కురుస్తుండటంతో చాలా మంది రైతులు గ్రాసాన్ని పొలాల్లో వదిలేశారు. గత ఏడాది శ్రీకాళహస్తి ప్రాంతంనుంచి ట్రాక్టర్ వరికుప్పను రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు వెచ్చించి తెచ్చుకున్నారు. విడిగా అయితే ఒకమోపు కట్టు రూ.130 ధర పలికింది. ఈ ఏడాది ఇదే పరిస్థితి అక్కడ కూడా నెలకొనడంతో పశుగ్రాసం దొరికే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా రైతులకు పశుగ్రాస విత్తనాలను సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఈ మార్గంలో రాకపోకలు ఎట్లా?



తిరుపతిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట రహదారి నుంచి పేరూరు గ్రామానికి వెళ్లే మార్గంలో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూపాల్ గోల్డెన్ గార్డెన్ మీదుగా నిర్మించిన తుడా రహదారిలో గతంలో పలువురు స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగించేవారు. ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూపాల్ గార్డెన్‌కి ఎదురుగా రహదారి ఎత్తు పెరగడంతో అటువైపు ప్రయాణాలు సాగించడం ఇబ్బందికరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామానికి చేరుకోవాలంటే వకుళమాత ఆలయ ఆర్చి వద్ద ఉన్న సర్కిల్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకునిగానీ లేదా తుమ్మలగుంటమీదుగా గానీ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంతదూరం వాహనాలపై రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు. జాతీయ రహదారి, తుడారహదారి కలిసే చోట మధ్యలో ర్యాంప్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేదని అంటున్నారు. అధికారులు, పాలకులు ఈ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

తిరుపతి

నేషనల్ కెరీర్ అండ్ స్కిల్స్ కాంటెస్ట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నేషనల్ కెరీర్ అండ్ స్కిల్స్ కాంటెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. యువతలో స్కిల్స్ మెరుగుపరచడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇస్కాన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు రేవతి రమణదాస్ మాట్లాడుతూ నేషనల్ కెరీర్ అండ్ స్కిల్స్ కాంటెస్ట్ 40రోజులు జరుగుతుందని, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని అన్నారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శన కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7993371444ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ఉపాధ్యక్షులు రూపేశ్వర్ చైతన్యదాస్, జీఎం బలభద్ర మాధవదాస్ పాల్గొన్నారు.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరిస్తాం

తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్పెంటర్ల సమస్యలను పరిష్కరించి, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక పద్మావతిపురంలోని కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు కె.వి. రత్నం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పెంటర్ల కోసం వర్క్‌షెడ్ నిర్మాణానికి స్థలం కేటాయించేలా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కుప్పాచారి, కోశాధికారి దేవరాజాచారి పాల్గొన్నారు.

ఎనిమిది మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు: 12 దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎ‌స్ఐ నరేష్ బృందం స్థానిక ఫారెస్టు బీటు ఆఫీసర్ అంజనా స్వాతితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్ చిన్నముచ్చురాళ్లగుట్ట వద్ద కూంబింగ్ చేపట్టారు. కొంతమంది గుమికూడి ఉండటం గమనించి, సమీపిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఎనిమిది మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఐఏడీవీఎల్ వార్షికోత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వెంకటేశ్వర మెడికల్ కాలేజీలోని ప్రేమసాగర్ భవనంలో గల భువన విజయం ఆడిటోరియంలో ఈ నెల 6వ తేదీ నుంచి రెండు రోజులపాటు ఐఏడీవీఎల్ 44వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ డెర్మటాలజీ, వెనెరియాలజీ అండ్ లెప్రసీ విభాగం, శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చర్మవ్యాధులు, క్లీనికల్ సవాళ్లు, పరిశోధనలు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. వైద్యపరమైన పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏడీవీఎల్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు డాక్టర్ పి.శ్రీనివాసులు, కార్యదర్శి డాక్టర్ భుమేష్‌కుమార్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.మోహన్‌రావు, కో చైర్మన్ డాక్టర్ డీఎస్ఎస్.శ్రీనివాస ప్రసాద్, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.యుగంధర్ పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తే వారికెందుకు బాధ?

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ప్రొటోకాల్ విషయమై అధికారులను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నిస్తే శంకర్‌రెడ్డి వర్గీయులకు ఎందుకు బాధకలిగిందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా సత్యవేడులో నెలకొన్న పరిస్థితులపై టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించాలి'అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు మద్దతుగా టీడీపీకి చెందిన దళిత విభాగం నాయకులు పేర్కొన్నారు. వీరు శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. టీడీపీనియోజకవర్గ ఇన్‌చార్జిగా శంకర్‌రెడ్డి నియామకంనుంచి పార్టీలో అంతర్గత విభేదాలు పెరిగిపోయాయన్నారు. దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న ఆయన.. ఆ అపవాదును ఎమ్మెల్యేపైనెట్టి రాజకీయలబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఆదిమూలంకు టిక్కెట్టు ఇచ్చినప్పుడు ఆందోళనలు చేసినవారు ఇప్పుడు గెలుపునకు కృషిచేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, జిమురళి, నేతలు పి.రమేష్, సుబ్రమణ్యం, ఊరప్ప, సుధాబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన : జనసేన

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల అమలుతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అధికారంలో లేని సమయంలోనే జనసేన అధినేత పవన్‌కళ్యాన్ కౌలు రైతులను ఆదుకున్నారని, ఈ విషయాన్ని మరచి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని అన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామిపై భక్తి, విశ్వాసం లేని జగన్ పరకామణి చోరీ కేసుపై మాట్లాడిన తీరు అక్షేపణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మధుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, చైతన్య, భరత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ 12వ తేదీన నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. దీనికిముందు ఎస్వీ యూనివర్సిటీ నుంచి భారీ ర్యాలీ ఉంటుందని వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, కార్యదర్శులు ఆదర్శ్ ఎం.సాజి, భట్టచార్య, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి రామోహ హాజరవుతారని తెలిపారు. చెన్నై హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు.

మహిళా వర్సిటీలో వీనా నోబుల్ దాస్ ఎండోమెంట్ లెక్చర్



ప్రొఫెసర్ రమేష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ వీనా నోబుల్ దాస్ ఎండోమెంట్ లెక్చర్ నిర్వహించారు. ఇందులో నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రమేష్ 'ఫెమినిజం' గురించి ప్రసంగించారు. సమాజాన్ని సాహిత్యాన్ని ఫెమినిజం దృష్టితో పరిశీలించవలసి ఉందన్నారు. ప్రొఫెసర్ వై.ఎస్.శారద అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ వీనా నోబుల్ దాస్ కుమార్తెలు షరీన్, హెఫ్సిబా ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

నేడు గంగమ్మ ఆలయానికి స్థలం స్వాధీనం

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ విస్తరణలో భాగంగా వాయువ్య దిశలోనున్న భవనాన్ని దాతల సహకారంతో కొనుగోలు చేసినట్లు చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో ఏ.జయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు చేసిన భవనస్థలాన్ని శనివారం స్వాధీనం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నేడు సైన్స్ ఫెస్టివల్

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శని, ఆదివారాల్లో సైన్స్ ఫెస్టివల్ జరుపుతున్నట్లు సైన్స్‌సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా, ఐడియా థాన్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు కార్య క్రమం ప్రారంభవుతుందని తెలిపారు.

9న ఎన్ఎంయూ మహాధర్నా

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులసమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డీపీటీవో కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి బి.ఎస్.బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోల ఎన్ఎంయూ కమిటీ ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా భారతీయ భాషల ఏకీకరణ అంశంపై సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఇందులో పాల్గొన్న ప్రతినిధులకు భారతీయ భాషా సమితి ప్రతినిధి గిరిధర్ రావు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

మొక్కలు నాటిన టీఎన్ఎస్ఎఫ్ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఎస్వీయూలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మొక్కలు నాటారు. ఇటీవల వర్షాలకు ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లు కూలాయని వారన్నారు. వీటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే



వేదికపై ఎమ్మెల్యే ఆరణి, పట్టాభి, సుగుణమ్మ తదితరులు

తిరుపతి(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, విద్యార్థుల పురోగతికి పెద్దపీట వేస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి మాట్లాడుతూ ఒత్తిడిలేని విద్యావిధానాలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వంకృషి చేస్తోందన్నారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ... ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెరుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ట్రెండ్స్‌లో..

తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను కూర్చోబెట్టారు. ఆయా క్లాస్ టీచర్లతో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను చూపించి, పరిస్థితులు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. స్కూల్ ప్రగతిని, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. పదవ తరగతి వంద రోజుల ప్రణాళికను వివరించారు. ఇటీవల జరిగిన ఆటల పోటీలలో రాణించిన విద్యార్థులను అభినందించారు.అందరూ కలసి భోజనం చేశారు. స్థానిక టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, నాగరాజు, శశి, మహేశ్వరి, జానకి, ఈశ్వరయ్య, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ భాను, సుశీల, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవులనాయుడు

విద్యార్థుల బంగారు భవితకు భరోసా

● మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో శాప్ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుందని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తిరుపతి నగరంలోని సత్యనారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులతో మమేకమై విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాల కల్పన కోసం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటేలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, గంగమ్మగుడి చైర్మన్ మహేష్‌యాదవ్, తోట వాసు, గోళ్ల మధుసూదన్‌నాయుడు, సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీరాములు, హేమంత్‌రాయల్, హెచ్ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆటపాటలతో మానసికోత్తేజం

వ్యవసాయ వర్సిటీ క్రీడా, సాంస్కృతికోత్సవాలు ప్రారంభం



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడా సాంస్కృతి అంశాలతో విద్యార్థుల్లో శారీరక, మానసికోత్తేజం కలుగుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా, సాంస్కృతిక పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నాని మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉందన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా సాంస్కృతిక పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు వ్యవసాయ రంగంతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. వ్యవసాయ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు, వ్యవసాయ వర్సిటీ డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలు, సాంస్కృతిక వక్తృత్వ పోటీలలో పాల్గొనడం విద్యార్థుల మనో వికాసానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డి శేఖర్, ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి, కళాశాల పీడీ రవికాంత్‌రెడ్డి, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

క్రీడలలో బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక పోటీల్లో పెయింటింగ్స్, కొలైజ్ వంటి అంశాలతో పాటు వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త బద్రీనారాయణ మృతి

చిత్తూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పారిశ్రామికవేత్త బద్రీనారాయణ(72) అనారోగ్యంతో కన్నుమూశారు.చిత్తూరులోని బీవీ రెడ్డి కాలనీలో నివసిస్తున్న ఆయనకు శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని అమర హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ప్రస్తుతం ఆయన మృతదేహం అమరా ఆస్పత్రిలోనే వుంది.అమెరికాలో వున్న తన సోదరి వచ్చాక సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బద్రీనారాయణ కుమారుడు నవీన్ తెలిపారు.

ప్రభుత్వ సహకారంతో విద్యావేత్తలుకావాలి

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులు గొప్ప విద్యావేత్తలు కావాలని టీడీపీ సీనియర్ నాయకులు రొమ్మాల దేవేంద్రనాథ రెడ్డి ఆకాంక్షించారు. రేణిగుంట మండలంలోని ఎస్ఆర్ పట్టెడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు.

పేరూరులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మావతి జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ పేరూరులో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులు గ్రామంలో సేవా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరిదేవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు శారద, రాజేంద్ర, హరికృష్ణ పర్యవేక్షించారు.

ప్రజాస్వామ్యానికి పారదర్శక ఓటరు జాబితానే నిదర్శనం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిజమైన ప్రజాస్వామ్యానికి పారదర్శక ఓటరు జాబితాతనే నిదర్శనమని బీజేపీ రాష్ట్రఅధికార ప్రతినిధి జల్లి మధు సూదన్ పేర్కొన్నారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లా డుతూ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) వేగంగా, పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. ప్రతి ఓటరూ తమ వివరాలను సరిచూసుకుని అవసరమైతే సవరణలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

10న గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో జయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బ్రాహ్మణ కార్పొరేషన్ వార్షికోత్సవం

తిరుపతి అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మిట్టవీధిలోని బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం బ్రాహ్మణ కార్పొరేషన్ దశమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సొసైటీ పూర్వపు ఉపాధ్యక్షులు డాక్టర్ చిత్రపు స్వరాజ్యలక్ష్మి, పూర్వపు గవర్నింగ్ బాడీ మెంబర్స్ డాక్టర్ ఎ.సత్యనారాయణమూర్తి, దంత వైద్యురాలు వనజ హాజరయ్యారు. సొసైటీ తరపున తిరుమల పోటు కార్మికులకు రూ. 48లక్షల రుణాలకు సంబంధించి పత్రాలు అందజేశారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 5 : మీ-సేవ ఉద్యోగులు ఈనెల 7న నిర్వహించే పునర్జీవన సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి కోరారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో శుక్రవారం యాత్ర గోడ పత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తొలగించిన మీ-సేవ ఉద్యోగులను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విధుల్లోకి తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని, 19 నెలలు గడిచినా పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. 7న అలిపిరిలో ప్రారంభించి, అమరావతి వరకు కొనసాగిస్తారని తెలిపారు.

ఆ ఐదు పంచాయతీలను యథావిధిగా కొనసాగించండి

● బ్రాహ్మణపట్టు గ్రామసభలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ మధుశేఖర్

తిరుచానూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేమూరు, పానకం, కొత్తూరు, పాతూరు, బ్రాహ్మణపట్టు పంచాయతీలను గత ప్రభుత్వ హయాంలో మోసపూరితంగా విలీనం చేశారని, వాటిని యథావిధిగా కొనసాగించాలని తీర్మానించారు. బ్రాహ్మణపట్టు గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ 2019లో పింఛన్లు పెంచుతున్నామనే పేరుతో అప్పటి పాలకులు వృద్ధుల చేత సంతకాలు చేయించి, ఐదు పంచాయతీలను ఒకటిగా విలీనం చేశారని తెలిపారు. గతంలో మాదిరిగా ఐదు పంచాయతీలుగా కొనసాగించాలనే ప్రజల కోరిక మేరకు సింగిల్‌విండో అధ్యక్షుడు మధుశేఖర్ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపట్టు సర్పంచ్ నాగజ్యోతి, మాజీ సర్పంచ్ మునెమ్మ, తిరుచానూరు ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ మునికృష్ణారెడ్డి, తెలుగు యువత మండల నాయకులు రావిళ్ల సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ అంటే అంత లోకువా జగన్

● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందగౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అహంకారంతో మాట్లాడితే ఏ దేవుడు కూడా క్షమించడని గుర్తుంచుకోవాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందగౌడ్ సూచించారు. తిరుపతిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా మాట్లాడినందుకు జగన్ హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పరకామణి చోరీ విషయంలో అహకారంతో మాట్లాడిన తీరును హిందూ సమాజం క్షమించదని అన్నారు. హుండీ చోరీ చేస్తే తప్పేమిటి అంటావా అని అడిగారు. పరకామణి దొంగలు, వారి వెనకాకునున్న వారు అందరికీ బిగ్‌బాస్ జగనే అని స్పష్టం చేశారు.

ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో ప్రపంచ మృత్తికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బోటనీ, జాగ్రఫీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టాయి. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ సమస్త జీవరాశులకు మట్టే ఆధారమన్నారు. అవసరానికి మించి మానవ కార్యకలాపాల వల్ల మట్టి ఆరోగ్యం క్షీణిస్తోందని అభిప్రాయపడ్డారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

తిరుపతి సినిమా కళాకారులను ప్రోత్సహించాలి

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తిరుపతి సినిమా కళాకారులను ప్రోత్సహించాలని టీడీపీ నాయకులు జగన్నాథం కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నెక్స్ట్ ఫెస్టివల్ చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. హాస్యం, ఎంటర్‌టైన్మెంట్, థ్రిల్లర్ థీమ్‌గా నెక్స్ట్ ఫెస్టివల్ చిత్రం చిత్రీకరణ జరుగుతోందన్నారు. హీరోగా లోకేష్, హీరోయిన్‌గా అమృత బిందు నటిస్తున్నారని తెలిపారు. వచ్చే ఏడాది మహాశివరాత్రికి ఈ చిత్రం విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.



అక్కదేవతలకు కార్తీకపూజలు

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్ల గుడిలో ఏడుగురు అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ ట్రాన్స్‌పోర్టు విభాగం ఆధ్వర్యంలో క్రార్తీక మాస పూజలు నిర్వహించారు. సారె సమర్పించారు. ఈ సందర్భంగా అక్కగార్ల ఆలయాన్ని పుష్ప, విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈకార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ట్రాన్స్‌పోర్టు డీఎం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జనవరికల్లా అందుబాటులోకి బయోగ్యాస్‌ప్లాంట్



తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి 2026 జనవరి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐఓసీఎల్ ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని డంపింగ్ యార్డు వద్ద ఐఓసీఎల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, ఘన వ్యర్థాల నిర్వహణపై పద్మావతి గెస్ట్‌హౌస్‌లో టీటీడీ, ఐఓసీఎల్ ప్రతినిధులతో శుక్రవారం అదనపు ఈవో సమీక్షించారు. గ్యాస్‌ప్లాంట్ ప్రాంగణంలో కాలుష్య ద్రవాల నివారణకు అదనపు గల్పర్ మెషిన్లు ఏర్పాట్లు చేయాలన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 51,082

తలనీలాలు సమర్పించినవారు: 19,836



సీనియర్ సిటిజెన్స్‌కు నేరుగా దర్శనాలు కల్పించండి



'డయల్ యువర్ టీటీడీ ఈవో' లో కోరిన భక్తులు

'మేము దివ్యాంగులం. ఐదు నెలలుగా ఆన్‌లైన్‌లో టోకెన్ల కోసం ప్రయత్నిస్తున్నా లభించడం లేదు.'

ఆన్‌లైన్‌లోనే ఇస్తే పాకుతూ ముందుకు సాగే మాలాంటి వాళ్లం ఎలా దర్శనం చేసుకోగలం,

'నాకు 64 ఏళ్లు. ఎంతకాలం ఉంటానో తెలీదు. మాలాంటివాళ్లకు తిరుమలలోనే కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం కల్పించండి.'

వృద్ధులు, దివ్యాంగులను ఆన్‌లైన్ బుకింగ్‌కి పరిమితం చేయకండి. నేరుగా వచ్చినా స్వామి దర్శనం కల్పించండి అని పలువురు భక్తులు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం ఫోన్‌ల ద్వారా ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కోరారు. ఇలా కోరిన వారిలో మహేశ్వరయ్య (వెంకటగిరి), వెంకటేశ్వరరావు (ఏలూరు), శ్రీనివాస్(చెన్నై), దుర్గాప్రసాద్(భీమవరం) ఉన్నారు. ఇందుకు.. గతంలో క్యూలైన్ విధానంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేయడంతోనే ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నామని బదులిచ్చారు.

గుడిలో 'యో.. పోయా..'లు వద్దు

అలాగే, నాదనీరాజనం వేదికపై గత తరహాలో భారతం, రామాయణం, అన్నమయ్య కీర్తనలు, గరుడపురాణ కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీనివాసులు(హైదరాబాద్), రవి(రాజమండ్రి) కోరగా, త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. టీటీడీ ఉద్యోగులు, శ్రీవారిసేవలను ఆలయంలో 'యో.. పోయా' అంటూ దురుసుగా మాట్లాడుతున్నారని, అలా కాకుండా గోవిందా అనేలా చర్యలు తీసుకోవాలని శివశంకర్(వైజాగ్) సూచన చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఈవో చెప్పారు.

స్థానికులకు అన్యాయం

వైకుంఠద్వార దర్శనాల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి) ఈవో దృష్టికి తీసుకెళ్లగా, తొలి మూడురోజుల్లో బయటవాళ్లే కాకుండా స్థానికులు కూడా టోకెన్లు పొందారని ఈవో చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఒంటిమిట్టకు 50 ఏళ్ల మాస్టర్‌ప్లాన్

అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన శుక్రవారం సాయంత్రం అధికారులతో దీనిపై సమీక్షించారు. కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, ఆధ్యాత్మిక చిహ్నాలు, మ్యూజియం, డిజిటల్ స్క్రీన్లు, కళామందిరం, చెరువులో 108 అడుగుల జాంబవతుడి విగ్రహం, మాడవీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అనిల్‌కుమార్ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన పళని లక్ష్మణ్ 2016లో తిరుమల తుంబురతీర్థం వద్ద ఎర్రచందనం తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేయగా.. అతడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. విచారణలో ఉన్న ఈ కేసును తాజాగా తిరుపతిలోని రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ వాదనలు వినిపించారు.



ఇంటి ముందు దిగాలుగా రాజమ్మ

పాపానాయుడుపేటలో పేలిన గ్యాస్ సిలిండర్

- ధ్వంసమైన ఇంటి గోడ, కిటికీలు, సామాన్లు

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ఓ ఇంట్లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో స్టోర్‌రూంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు దెబ్బతినింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లకపోగా గృహోపకరణాలు, ఇంటి గోడ ధ్వంసమయ్యాయి. పాపానాయుడుపేటకు చెందిన రాజమ్మ భర్త పదేళ్ల కిందట, కుమారుడు ఐదేళ్ల కిందట మృతి చెందారు. ప్రస్తుతం ఈమె ఒంటరి మహిళ. ఈమె ఏడాదికి రెండు సార్లు సదాశివకోనకు వెళ్లి ఈశ్వరుడికి పూజలు చేసి అక్కడే భక్తులకు అన్నదానం చేస్తోంది. ఈ క్రమంలో ఈనెలలో కోనకు వెళ్లడానికి సరుకులు, గ్యాస్ సిలిండర్‌ను స్టోర్‌రూంలో పెట్టింది. గురువారం రాత్రి భోజనం చేసి వరండాలో పడుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు కాలి గోతాల మీద పడటంతో ప్లాస్టిక్ కాలిన వాసన రాజమ్మకు వచ్చింది. స్టోర్‌రూంలో మంటలు ఎగసిపడుతున్నట్లు గుర్తించి వెంటనే వెలుపలకు పరుగులు తీసింది. రాత్రి 11గంటలు కావడంతో రాజమ్మ పెట్టిన కేకలకు కొంతమందే బయటకు వచ్చారు. అప్పటికే ప్లాస్టిక్ కవర్లకు వ్యాపించిన మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలింది. ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పాపానాయుడుపేటకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో స్టోర్ రూం గోడలు బీటలు వారాయి. సరుకులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులు పాపానాయుడుపేటకు చేరుకుని విచారణ జరిపారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు తెలిపారు.



తిరుపతి కేంద్రంగా మొదలైన బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు క్రమంగా ఊపందుకుంటోంది. రాయలసీమ అభివృద్ధికి ఇది ఊతంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేధావివర్గం గొంతు కలుపుతున్నారు. బాలాజీ డివిజన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతి నుంచి ఢిల్లీదాకా డివిజన్ వాణి వినిపిస్తున్నారు. డివిజన్ సాధించేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. అందరూ కలిసిరావాలని పిలుపునిస్తున్నారు. బాలాజీ రైల్వే డివిజన్‌వల్ల మనకు కలిగే ప్రయోజనాలేమిటో కొందరు ప్రముఖుల అభిప్రాయాలు ఇవి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?

- బాలాజీ రైల్వేడివిజన్ సాధించుకుందామని మేధావుల పిలుపు

సాధించి తీరుతాం



తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ డిమాండు ఇప్పటిది కాదు. మనకు ఎప్పుడో రావాల్సింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా, బాలాజీ డివిజన్ దారి మళ్లి గుంటూరుకు వెళ్లింది. ఈసారి ఎలాగైనా డివిజన్ సాధనే లక్ష్యంగా ముందుకు వెళతున్నాం. మన ఆవేదనను ఎంపీల దృష్టికి తీసుకెళుతున్నాం. త్వరలోనే పదిమందితో ఢిల్లీకి వెళ్లనున్నాం. డివిజన్ ఏర్పాటైతే 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన ఉంటుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వసతులు, ఫైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి. రాష్ట్రానికి భౌగోళిక-ఆర్థిక సమతుల్యత తీసుకువస్తుంది. దీనిద్వారా రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడుల వృద్ధికి గట్టి పునాది ఏర్పడుతుంది.

- కుప్పాల గిరిధర్, కన్వీనర్, బాలాజీ రైల్వే డివిజన్ సాధనసమితి

కొత్తరైళ్లు వేసుకోవచ్చు



బాలాజీ డివిజన్ వస్తే తిరుపతి రూపురేఖలు మారిపోతాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుంది. 30 మంది సివిల్ అధికారులు వస్తారు. ఎగుమతి, దిగుమతుల ద్వారా వందల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. తిరుపతి నుంచి కొత్తకొత్త ప్రదేశాలకు రైళ్లు వేసుకోవచ్చు. రాయలసీమలో ఉండే ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంటుంది. పుటపర్తిని కలుపుకోవచ్చు. అన్ని పుణ్యక్షేత్రాలకు రైళ్లువేసుకోవచ్చు. తిరుపతి నుంచి నెల్లూరు, కాట్పాడికి లోకల్ ట్రైన్స్ వేసుకోవచ్చు.

- వేణుగోపాల్ రెడ్డి, సాధన సమితి నేత

సీమ ముఖచిత్రం మార్చవచ్చు



రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో గుంతకల్లు జోన్ అడిగాం. అది మరుగున పడింది. ఇప్పుడు కేవలం డివిజన్ మాత్రమే అడుగుతున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 70 డివిజన్లలో తిరుపతి ఎందుకు అడుగుతున్నామంటే డివిజన్ ఉంటే డీఆర్ఎం మనకు అందుబాటులో ఉంటారు. డివిజన్ ఏర్పాటు ద్వారా వెస్ట్ రైల్వే స్టేషన్, తిరుచానూరు రైల్వే స్టేషన్లు అభివృద్ధిచేసుకోవచ్చు. మదనపల్లి మీదుగా కడప, పీలేరు మీదుగా తాడిపత్రికి రైల్వే లైన్లు వేసుకోవచ్చు. పాకాల నుంచి పలమనేరు మీదుగా మరొక రైల్వే లైను వేయాలని డిమాండు ఉంది. డివిజన్ కల సాకారమయ్యే దిశగా తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చాలి.

- భూమన్, రాయలసీమ ఉద్యమ నేత

పార్టీలకతీతంగా ఉద్యమించాలి

పాతికేళ్ల ముందటి తిరుపతి వేరు, ఇప్పుడు వేరు. పెరిగిన జనాభా, రెట్టింపైన భక్తులు, విస్తరించిన పరిధి. విద్య, వైద్య సంస్థలు, పరిశ్రమలు పెద్దఎత్తున తిరుపతి జిల్లాకు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకుని చూస్తే బాలాజీ రైల్వే డివిజన్ అవసరం ఉందని అర్థమవుతుంది. పరిశ్రమలకు అవసరమైన ముడిసరకులు, తయారైన ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అవసరమైన రవాణా సులభతరం అవుతుంది. టూరిజంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పన మెరుగవుతుంది. కనెక్టివిటీ బాగుంటే అభివృద్ధి బాగుంటుంది. డివిజన్ సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుంది. రాయలసీమ మరింత అభివృద్ధి చెందుతుంది. పార్టీలకతీతంగా ప్రయత్నం చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది.



- డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సాధనసమితి నాయకురాలు

కనువిందుగా సదాశివకోన

వడమాలపేట మండలం సదాశివకోనలో జలపాతాలు కనువిందుచేస్తున్నాయి. సదాశివకోన, అమ్మవారికోనల్లో ఉవ్వెత్తున్న ఎగసి పడుతున్నాయి. ఈ జలపాతాల నీళ్లు ఏర్పేడు మండలంలోని సదాశివకోన ప్రాజెక్టుకు చేరుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





పరవళ్లు తొక్కుతున్న కైలాసనాథ కోన

నారాయణవనం మండలంలోని కైలాసనాథ కోన జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొండలమీద నుంచి కిందకు దూకే జలపాతం సందర్శకుల్ని మంత్రముగ్ధులను చేస్తున్నది. వర్షాలతో పరిస్థితులు కొద్దిగా ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో భద్రతపరంగా తాత్కాలికంగా ప్రవేశాన్ని నిలిపివేశారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

జలపాతాల జోరు

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఉబ్బలమడుగు, కేవీబీపురం మండలంలోని ఆరె జలపాతాలు వయ్యారాలు ఒలుకుతున్నాయి. ప్రస్తుతం ఈ జలపాతాల వద్దకు పర్యాటకులను ఆపేశారు. మరో రెండు రోజుల్లో అనుమతించనున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి



ఉబ్బల మడుగు - ఆరె జలపాతం...

ప్రామాణిక పరిశోధనలకు రూ.25 లక్షలు అందిస్తాం

- ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు సురేష్
- వెటర్నరీ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ విభాగాల్లో ప్రామాణిక పరిశోధనలు రూపొందించేందుకు ప్రోత్సాహంగా రూ.25లక్షల అందిస్తామని ఆంకోసిస్ బయోసంస్థ వ్యవస్థాపకుడు, వర్సిటీ పూర్వవిద్యార్థి డాక్టర్ పూసల సురేష్ పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై శుక్రవారం ముగిసిన రెండు రోజుల పీజీవిద్యార్థుల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. వర్సిటీలో చేపడుతున్న పరిశోధనలు ప్రామాణికత, నాణ్యతగా ఉన్నాయని అభినందించారు. భవిష్యత్‌లో వర్సిటీతో కలసి సంయుక్తంగా పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంటర్‌డిసిప్లినరీ పరిశోధనల అవసరం మరింతగా పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అధునాతన పరిశోధనలు రూపొందించాలని ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ సూచించారు. వెటర్నరీ సైన్స్ డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్‌డీన్ డాక్టర్ జగపతిరామయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.వినూ, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్విజ్‌పోటీలు

బీవీఎస్సీ ఫైనలియర్ చదివే విద్యార్థులకు ఆరుసెషన్లలో నిర్వహించిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఫైనల్‌లో ప్రతిభచాటిన పదిమందికి అవార్డులతోపాటు నగదు బహుమతి అందించారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు, పోస్టర్ ప్రజంటేషన్స్ చేసిన వారికి అవార్డులు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న వీసీ జేవీ రమణ, సురేష్ తదితరులు



ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసేందుకు కోర్టుకు వచ్చిన విద్యార్థులు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై జడ్జికి ఫిర్యాదు

సత్యవేడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాతపై విద్యార్థులు శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయమూర్తి వెంకట నాగరాజుకు ఫిర్యాదు చేశారు. హాజరు శాతం తక్కువగా ఉందంటూ తమ చేత పరీక్ష ఫీజులు కట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారంటూ ఆరోపించారు. విద్యార్థుల ఫిర్యాదును ఉన్నత విద్యాశాఖ అధికారులకు పంపిస్తానని జడ్జి వెంకట నాగరాజు తెలిపారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు

రేణిగుంట డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన కైలాష్, బాబు గౌడ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వీరిని తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి దొరికిందన్నారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ చెందిన చాహల్‌కు గంజాయిని అప్పగించేందుకు వెళుతున్నట్లు విచారణలో చెప్పారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, ఈ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. సీఐ జయచంద్ర, స్టేషన్ రైటర్ చలపతి పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.41కోట్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,41,30,077 వచ్చింది. ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 34 గ్రాములు, వెండి 375.800కిలోలు, విదేశీ కరెన్సీ 108 వచ్చాయి. 23 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చిందని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ యంగ్ ఇండియన్స్ చాప్టర్ చైర్‌గా నితిన్



నితిన్ దత్తులూరి

తిరుపతి(వైద్యం)/చంద్రగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఐఐ యంగ్ ఇండియన్స్, తిరుపతి చాప్టర్ తన వార్షిక సెషన్‌ను శుక్రవారం తిరుపతిలోని తాజ్ హోటల్లో నిర్వహించారు. తిరుపతి చాప్టర్ చైర్‌గా రావండ్స్ ప్లాస్టిక్ సేల్స్ అండ్ మార్కెటింగ్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసిన నితిన్ దత్తులూరిని, జాయింట్ చైర్‌గా చిత్తూరులోని బాలాజీ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రతీణ్ పోలవరపును నియమించారు. యువత పారిశ్రామిక రంగంలో రాణించడం వల్ల దేశం అభివృద్ధిపథంలో ఎంతో ముందుకు వెళుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరు మౌర్య, యంగ్ ఇండియన్స్ చైర్‌పర్సన్ వర్ష విశ్వనాథ్‌కస్తూరి, జాయింట్ చైర్ ప్రదీప్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

త్వరలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం



పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజుల ఆలయం ఎదురుగా అండర్‌బ్రిడ్జి నిర్మించాలని రైల్వే అధికారులు నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. శుక్రవారం ఆలయ సమీపంలో గేటు పుత్తూరు వాసులులతోపాటు పది గ్రామాల ప్రజలు నిత్యం వినియోగించే దారిని మూసివేశారు. ఇటీవల రైళ్ల వేగం, సంఖ్య పెరగడంతో స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ దారిని మూసివేసినా, తిరునాళ్ల సమయంలో ఆ స్తంభాలను తోసివేశారు. దీంతో యధావిధిగా ప్రజలు పట్టాలు దాటుతుండడంతో గత మూడు నెలల కాలంలో 13 ప్రమాదాలు జరిగాయి. దీనిపై ఎంపీ గురుమూర్తికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మాజీ మంత్రి రోజా వినతిపత్రం సమర్పించగా, ఆయన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. దీనిపై క్షేత్రస్థాయిలో అధికారుల నివేదిక తెప్పించుకున్నట్టు సమాచారం. ఈక్రమంలో అండర్ బ్రిడ్జిని వీలైనంత త్వరగా నిర్మించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

13న జాతీయ లోక్‌అదాలత్

● సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



న్యాయవాదులకు దిశానిర్దేశం చేస్తున్న జడ్జి

పుత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టు ఆవరణలో ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి. రాఘవేంద్ర కోరారు. శుక్రవారం కోర్టు హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అధికసంఖ్యలో రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను పరిష్కరించాలని న్యాయవాదులకు సూచించారు. పుత్తూరు మధ్యవర్తిత్వ కేంద్రంలో ఐదుగురు అనుభవం కలిగిన మధ్యవర్తులు ఉన్నారని, వారి సేవలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్ బాబు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

'వేణుగోపాల్ సాగర్'ను పూర్తి చేయండి

● మంత్రి నిమ్మలకు విజయబాబు వినతి



పుత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న వేణుగోపాల్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలనిజలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు వినతిపత్రం అందించారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన ఈమేరకు ప్రాజెక్టు పూర్తైతే మండలపరిధిలో తాగు, సాగునీటి సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు విజయబాబు చెప్పారు. గాలేరు - నగరి ప్రాజెక్టుతో సంబంధం లేకుండా వేణుగోపాల్ సాగర్‌ను పూర్తి చేస్తే 70 శాతం వర్షపు నీటిని పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు, అక్కడ నుంచి వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లకు, నగరి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు నీటిని మళ్లించవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో గురుకుల పాఠశాలకు సొబగులు

● రూ.36 లక్షల నిధులతో మరమ్మతులు



ప్లంబింగ్ పనులు చేస్తున్న కూలీలు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలకృష్ణపురంలో ఉన్న గురుకుల పాఠశాల సరికొత్త హంగులతో రూపుదిద్దు కుంటోంది. గత అసెంబ్లీ సమావేశంలో గురుకుల పాఠశాలలోని వసతుల అంశంపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రస్తావించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి నిధుల విడుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పాఠశాలలో రూ.36 లక్షలతో మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రహరీ నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల ఆధునీకరణ, ఎలక్ట్రిక్ పనులు, కిటికీలకు మెష్‌లు, పైప్‌లైన్ వర్క్, పెయింటింగ్ తదితర పనులు చేపడుతున్నారు.

అట్టహాసంగా మెగా పీటీఎం

వడమాలపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మూడో విడత పేరెంట్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం వడమాలపేట మండలంలో అట్టహాసంగా నిర్వహించారు. వడమాలపేట బాలుర హై స్కూల్‌లో ఎంఈవోలు పద్మావతి, తులసిరాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులకు స్వాగతం పలికి విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేసి వారితో చర్చించారు. విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తల్లిదండ్రులు ఇచ్చిన సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాల్ డిల్లిబాబు, ప్రధానోపాధ్యాయులు కరుణా నవనీతం, మునిమోహన్, రవిశేఖర్ రెడ్డి, విమల, రెడ్డయ్య, నాగభూషణం శర్మ, గోపాల్, విద్యా కమిటీ ఛైర్మన్లు, దాతలు, నాయకులు పాల్గొన్నారు.



పుత్తూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో కూటమి నాయకులు, తల్లిదండ్రులు ఆధ్వర్యంలో పేరంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0ను నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు మాట్లాడుతూ.. పాఠశాలలోని సమస్యలను తల్లిదండ్రులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శశికళ, జనసేన నాయకుడు మహేష్, కౌన్సిలర్ భానుమతి, పేరంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన జీఎస్టీ కోర్సు

పుత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ విధానం వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి లాభసాటిగా మారిందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో కొత్తగా ప్రవేశపెట్టిన 50 రోజుల జీఎస్టీ కోర్సు ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొత్త పన్ను విధానం వల్ల ప్రభుత్వానికి అధిక రాబడి రావడంతో వివిధ వస్తువుల మీద పన్నును తగ్గించడంతో ఆమేరకు ధరలు తగ్గాయని అన్నారు. ఈ కోర్సు వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పుత్తూరు టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య తెలిపారు. శుక్రవారం గోపాల కృష్ణపురంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. సుమారు 1500 బస్తాల యూరియా పంపిణీ సిద్ధంగా ఉందన్నారు. ఏవో కోదండయ్య, టీడీపీ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

దొరవారిసత్రం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. 2022 డిసెంబరు 6వ ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక పట్ల కుప్పారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కల్లెంబాకం సుమన్ యువకుడికి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు పోక్సో కోర్టులో కేసు విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి సుమ తీర్పు ఇచ్చారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

వాకాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు ముస్లిం వీధిలో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 10వ తేదీన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంవీరావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ తెలిపారు. వివరాలకు 9440096224, 7569890729 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అటవీ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

బాలాయపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిగిలాం కొత్తపాళెంలో అటవీ భూమిని కొందరు ఆక్రమించారని గిరిజనకాలనీ వాసులు తహసీల్దార్ విజయలక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు.





పూర్తిస్థాయి నీటిమట్టంతో చెన్నూరు చెరువు - కలుజు పారుతున్న మర్రిపల్లిమడుగు చెరువు

నిండుకుండల్లా చెరువులు

పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నీటిమట్టం

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలో అన్ని చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నిండి కలుజులు పారుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన 21 చెరువులు, 100 ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన 19 చెరువులు ఉన్నాయి. మొత్తం 40 చెరువుల కింద 7,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ భూములను పూర్తిస్థాయిలో సాగు చేయాలంటే 860 ఎమ్‌సీఎఫ్‌టీ (మెట్రిక్ క్యూబిక్ ఫీట్) నీరు అవసరముంటుంది. 2015లో తుపాన్ల కారణంగా అప్పట్లో అన్ని చెరువులు నిండి పూర్తిస్థాయి నీటి సామర్థ్యాన్ని కలిగి ఉండడంతో రైతులు పంటలను సాగు చేశారు. ఆ తరువాత ఇప్పటి వరకు చెరువుల్లో పూర్తిస్థాయి సామర్థ్యం లేకపోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు అందకపోవడంతో రైతులు తెలుగుగంగపై ఆధారపడి సాగు చేపట్టేవారు. చివరి ఆయకట్టుకు నీరు అందక ఆశించిన మేర దిగుబడులు రాక ఆవేదన చెందేవారు. ఇటీవల కురిసిన వర్షాలకు అన్ని చెరువులు పూర్తి సామర్థ్యంతో జలకళను సంతరించుకున్నాయి. నిండుకుండల్లా మారి కలుజులు ప్రవహిస్తుండంతో, చివరి ఆయకట్ట వరకు నీరు అందుతుందని, సస్యశామలంగా పంటలను పండించుకోవచ్చనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం: పాశిం



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాశిం

చిల్లకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. డీఎస్సీ నిర్వహించి నూతనంగా ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా రూ.15వేల చొప్పున జమ చేశామన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరకోవాలని సూచించారు. పాఠశాలలోని తాగునీటి సమస్య పరిష్కరించి ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరగా, సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా శస్త్రచికిత్సకు అవసరమై ఖర్చు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో రఫూఫ్, ఎంపీడీవో గోపి, తహసీల్దారు శ్రీనివాసులు, హెచ్‌ఎం జ్యోతి, శ్రీనివాసులు, విద్యాకమిటీ ఛైర్మన్ కవిత, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, గుండాల లీలావతి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లూరు రామ్మూర్తి, మునిశేఖర్‌గౌడ్, సోమశేఖర్, దినేష్, మల్లికార్జున్, మధు, సురేష్‌బాబు, బాలరమణయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.





పాములకాలువ బ్రిడ్జి వద్ద, బోడిలింగాలపాడు మలుపువద్ద జాతీయ రహదారిలో గుంతలు

జాతీయ రహదారులపై గుంతలు

తడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల జాతీయ రహదారులు గుంతలు పడి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా బోడిలింగాలపాడు మలుపువద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు అధికారులు ప్యాచ్ వర్కులు చేస్తున్నా రెండు, మూడు రోజులకే మళ్లీ గుంతలు పడిపోవడం సాధారణమైపోయింది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం పోలీసుస్టేషన్‌ను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతి గురించి సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్‌తో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జాతీయ రహదారిలో ప్రమాదాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దాబా హోటళ్లపై చర్యలు చేపడతామన్నారు.

వేనాటి మునిరెడ్డికి నివాళి

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టీడీపీ కార్యాలయంలో వేనాటి మునిరెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, నాపా మునిరాజా, మెస్ రమణయ్య, రమష్ రెడ్డి, బుజ్జిబాబు, వంకా శ్రీనివాసులు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, మహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, మంజుల, విజయమ్మ, వేనాటి అభిమానులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

గూడూరు అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలనాగమ్మ అన్నారు. శుక్రవారం పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏటా నిర్వహించే అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం ఆదివారం జరగనుంది. షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వర ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం జ్యోతిని వెలిగించి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

దివ్యాంగులకు ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నెల్లూరులోని దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, సాధికారిత పునరావాస సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 98 మంది హాజరయ్యారు. వీరిలో 28 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు.

వలస నేతలకు పదవులొద్దు



శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేంద్ర

నాయుడుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి చేసేవారికి సముచిత స్థానం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్‌ను కోరారు. శుక్రవారం నెల్లూరులో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా కందల కృష్ణారెడ్డినే కొనసాగించాలని, లేనిపక్షంలో పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. అంతేకానీ అధికారంలోకి వచ్చాక వైసీపీ నుంచి వలస వచ్చిన వారిని నియమించవద్దని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

వాకాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి పంచాయతీ వెంకటరెడ్డిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కావలి గున్నయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పార్టీ నాయకులు పరామర్శించి రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు.





కోట మండలం తిన్నెలపూడిలో నీటమునిగిన వరిపైరు - లక్ష్మక్కకండ్రిగలో పొలాల్లో ఇసుక మేటలు

నీట మునిగిన పంట పొలాలు

కోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో కోట మండలంలోని పలు గ్రామాల్లోని వరిపైర్లు నీటమునిగాయి. తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, పడమటిపాళెం, రాజుపాళెం గ్రామాల్లో వరిపైర్లు దెబ్బతిన్నాయి. స్వర్ణముఖి, మామిడి కాలువలు ఉప్పొంగడంతో పడమటి పాళెంలోని ఒక రైతుకు చెందిన ఐదు ఎకరాలలో వరిపైరు తేలిపోగా నాట్లు దెబ్బతిన్నాయి. అదేవిధంగా లక్ష్మక్కకండ్రిగలో వరి పొలాలపై ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట: దిత్వా తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు కురిసిన వర్షానికి సూళ్లూరుపేట మండలంలో వందలాది ఎకరాల పంట పొలాలు నీటి మునిగాయి. మంగళంపాడు, ఇలుపూరు, ఎన్‌వీకండ్రిగ, కోటపోలూరు, గోపాల్ రెడ్డిపాలెం, గొల్లములుపు, కుదిరి, కడపత్ర, దామరాయి, కొరిడి గ్రామాల్లో వరి మడులు చెరువులను తలపిస్తున్నాయి.

వాకాడు: ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు వాకాడు, కల్లూరు, కాశీపురం, తదితర గ్రామాల్లో వరినాట్లు నీటమునిగాయి. వ్యవసాయ శాఖ అధికారిణి దీప పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందించేందుకు మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యా బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. అనంతరం పాఠశాలలో తరగతులు, ల్యాబ్, డిజిటల్ లెర్నింగ్ రూంలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు, ట్యాబ్‌లెట్లు, డిజిటల్ మెటీరియల్స్, స్కూల్ కిట్స్ విద్యార్థులకు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో తెలుసుకొన్నారు. విద్యార్థులు చూపిన ప్రతిభ, టూల్స్‌తో సాధిస్తున్న పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, ప్రిన్సిపాల్ కామేశ్వరి, సీడీపీవో షంషాద్ బేగం, ఎంపీడీవో గుణశేకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, రామకృష్ణ, జనసేన నాయకులు రామారావు అనీల్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయాలతో సత్వరాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీడీవో కార్యాలయాలతో సత్వరాభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజన్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను ప్రారంభించారన్నారు. తద్వారా వేగవంతంగా గ్రామీణ సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలుశెట్టి, విజయ్, కేశవరెడ్డి, కుంపటి శీను, రోహిణి, సల్మా, భానుప్రకాష్, శ్రీనివాస్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతులకు సాదాబైనామా రిజిస్ట్రేషన్లు

డక్కిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులకు సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని తమసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. 2024 జూన్ 15వ తేదీ లోపు జరిగిన సాదాబైనామా లావాదేవీలను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేటీ రోడ్డులో ఇరుక్కున్న లారీ



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవమైలు సమీపంలో రోడ్డు పక్కన లారీ దిగబడింది. శ్రీకాళహస్తి నుంచి వస్తుండగా పదవమైలు దగ్గర మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పైపులైను కోసం తవ్విన గుంతలో దిగబడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

దివ్యాంగులకు సహకరిద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సానుభూతి కాదు సహకారం అందించాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బీఎన్‌కండ్రిగ భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలు జన్వంత్, ప్రణతి, జగన్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గొడ్డేరు వాగు



పిచ్చాటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగ వద్ద గొడ్డేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సిద్ధిరాజు కండ్రిగ జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ముందస్తుగా రెండు రోజులు సెలవు ప్రకటించారు. అలాగే అరణియార్ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతం నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండడంతో ప్రాజెక్టు గేట్ల ద్వారా 8 వందల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

పుత్తూరు టౌన్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆనంబట్టు రోడ్డులో నాగూర్ ఖాదరవల్లీ దర్గాలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఏటా నిర్వహించే గంధ మహోత్సవం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహ్మద్ నబీ, ఖాజాపీర్, గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, నాయకులు బాబునాయుడు, యుగంధర్, మురళి, హరి, మైనార్టీ సెల్ నాయకులు రఫి, కరీమా, శంషు, మనస్, తురబ్‌బాషా, హమీద్ బాషా పాల్గొన్నారు.

15 రోజుల్లో అర్జీల పరిష్కారం: సుధీర్


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే సుధీర్

రేణిగుంట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. పంచాయతీరాజ్‌కు సంబంధించి 119 వినతులు, రెవెన్యూకు 270, హౌసింగ్‌కు 518, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 2, మత్స్యశాఖకు సంబంధించి ఒక వినతి వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రేణిగుంట జగనన్న కాలనీలో పట్టాల సమస్యను ఆరునెలల్లో పరిష్కరిస్తానని చెప్పారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతామన్నారు. వెలుగు సమాఖ్య భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, ఎంపీడీవో రవిచంద్ర, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, మునస్వామినాయుడు, పుష్పనాథన్, కన్నన్ రెడ్డి, కొరియర్ రవి, డి.రమణ, సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన


సమావేశంలో మాట్లాడతున్న శంకర్ రెడ్డి

పిచ్చాటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం లభించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని వెంగళత్తూరు జడ్పీ హైస్కూలులో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, పల్లికొండేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పద్మనాభరాజు, సింగిల్‌విండో చైర్మన్ జయచంద్ర నాయుడు,తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహ్మద్‌రఫి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో ఉపాధి అవకాశాలు


ఎమావేశంలో మాట్లాడుతున్న అశోక రాజు

నారాయణవనం, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌తో భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు వస్తాయని, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు పేర్కొన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై అధ్యాపకులకు 5 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు బెంగళూరుకు చెందిన శాంసంగ్ ఆర్ అండ్ డీ నుంచి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాథమికాలు, క్యూబిట్ నిర్మాణం, పరిశ్రమల్లో వినియోగంపై శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు పోటీ ప్రపంచానికి తగిన విధంగా అప్డేట్ అవ్వాలని సూచించారు. శిక్షణకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 50 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

ఏడుగంగమ్మల జాతరను విజయవంతం చేద్దాం


నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏడుగంగమ్మల జాతరను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి సూచించారు. ఈ నెల 10వ తేదీన జరగనున్న ఏడుగంగమ్మల జాతర నిర్వహణపై ఆయా కమిటీల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... జాతర సందర్భంగా కమిటీ సభ్యులు అనుసరించాల్సిన నిబంధనలు వివరించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జాతర జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 1టౌన్ సీఐ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణవనం, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు నారాయణవనం బాలికల హైస్కూల్ విద్యార్థుల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మనోరమ్మ తెలిపారు. పాఠశాలలో టెన్త్ చదువుతున్న ఎస్.వి. పవిత్ర, కె.పావనితేజ, 8వ తరగతి విద్యార్థి ఎస్.నిఖిత ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబర్ 27న తిరుపతిలోని భారతీయ సాంస్కృతిక విశ్వవిద్యాలయంలో జరిగే క్విజ్ పోటీలో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. జిల్లా కౌశల్ కో ఆర్డినేటర్ ధనంజయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రతిమాచౌదరి, వాణి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన

వరదయ్యపాళెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదయ్యపాళెంలో తిరుపతి జిల్లావనరుల కేంద్రం ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష, ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. తమ పొలాల్లోని మట్టిని రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షకు పంపిన వారందరూ ఫలితాల కార్డులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది, వరదయ్యపాళెం మండల రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తే వారికెందుకు బాధ?

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ప్రొటోకాల్ విషయమై అధికారులను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నిస్తే శంకర్‌రెడ్డి వర్గీయులకు ఎందుకు బాధకలిగిందో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా సత్యవేడులో నెలకొన్న పరిస్థితులపై టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించాలి' అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు మద్దతుగా టీడీపీకి చెందిన దళిత విభాగం నాయకులు పేర్కొన్నారు. వీరు శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా శంకర్‌రెడ్డి నియామకం నుంచి పార్టీలో అంతర్గత విభేదాలు పెరిగిపోయాయన్నారు. దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న ఆయన.. ఆ అపవాదును ఎమ్మెల్యేపై నెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆదిమూలంకు టిక్కెట్టు ఇచ్చినప్పుడు ఆందోళనలు చేసిన వారు ఇప్పుడు గెలుపునకు కృషి చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, జిమురళీ, నేతలు పి.రమేష్, సుబ్రమణ్యం, ఊరప్ప, సుధాబాబు పాల్గొన్నారు.

చెంచులక్ష్మికి ఇరుముడి సమర్పణ



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరులో కొలువై ఉన్న చెంచులక్ష్మికి భక్తులు ఇరుముడి సమర్పించారు. బీఎన్‌కండ్రిగలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో చెంచులక్ష్మి మాల ధరించిన భక్తులు ఇరుముడి కట్టుకుని కాటూరులోని చెంచులక్ష్మి అమ్మవారు సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెంచులక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తు పాదయాత్రగా చేరుకున్నారు. అనంతరం కడియాలరాంబాబు స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ఇరముడులు చెల్లించారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పిల్లల విద్యాభివృద్ధి

వేడుకగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్






నారాయణవనం తమిళ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం - రేణిగుంట జడ్పీ బాలికల పాఠశాలలో సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే సుధీర్ - శ్రీకాళహస్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని టీడీపీ నాయకుడు, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్, పూర్వ విద్యార్థి డిల్లీబాబు అన్నారు. పట్టణంలోని బహదూరుపేట పురపాలక సంఘ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పిల్లలకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు.

- ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని జడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... ఈ తరహా సమావేశాలకు తల్లిదండ్రుల హాజరై తమ పిల్లల లోటుపాట్లను ఉపాధ్యాయులతో చర్చించాలని సూచించారు. హెచ్‌ఎం తీగల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంలో సమావేశం జరిగింది. కెరీర్ గైడెన్స్ , బాలికల సంరక్షణ, నైతిక విలువలపై హెచ్‌ఎం చిరంజీవులు ప్రసంగించారు. ప్రగతి సంస్థ కన్వీనర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ రామచంద్ర పాల్గొన్నారు.
- రేణిగుంట పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ బిడ్డలపై విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈవో లక్ష్మీపతి చెప్పారు. కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఉపకారవేతనాలకు 84 మంది విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, ఎంఈవో రవి కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షుడు చంద్రబాబు, సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటుగా విలువలతో కూడిన బోధన జరుగుతుందని కల్లివెట్టులో ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో రాంద్రనాథ్ అన్నారు. బీఎన్ కండ్రిగ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో2 మునిసుబ్రమణ్యం మాట్లాడుతూ మన ఊరు మన బడిని బాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తల్లిదండ్రులు కోరారు. మెగా పీటీఎం కార్యక్రమాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. పరమాలపల్లి ప్రభుత్వ పాఠశాల్లో జరిగిన సమావేవంలో ఎంఈవో ప్రేమలత, బండారుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో దయాకర్ పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనం తమిళ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ప్రగతిపై ఉపాధ్యాయులకు బాధ్యత ఉంటుందో, తల్లిదండ్రులకూ ఉండాలన్నారు. విద్యార్థి భవిష్యత్తు కలలను సాకారం చేసే విధంగా గురువులు తోడ్పాటునందిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. జడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ పాల్గొన్నారు. పాలమంగళం జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని నాగలాపురం మండల విద్యాశాఖ అధికారి బాబయ్య పేర్కొన్నారు. శుక్రవారం నాగలాపురం పభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం సమావేశం జరిగింది. నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శుక్రవారం పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకుని ఆ పాఠశాలకు, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అసమానతలు లేని సమాజం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు డిల్లీ, రజని, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఎంఈవో యుగంధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మూడవ విడత పేరెంట్స్, టీచర్స్ సమావేశం శుక్రవారం వరదయ్యపాళెం మండలంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలో తల్లిదండ్రులకు స్వాగతం పలికి విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేసి వారితో చర్చించారు. విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తల్లిదండ్రులు ఇచ్చిన సూచనలు, సలహాలు స్వీకరించారు. వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం పంచాయతీలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో పుస్తక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరంట్స్, టీచర్స్ మీటింగ్‌ను పండుగలా నిర్వహించారు. జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువే ఆస్తిగా ఇవ్వాలన్నారు. విద్యతో సమాజంలో అసమానతలు తొలగుతాయన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ నారాయణ స్వామి, ఎంఈవోలు రవి, ఉష, ఎంపీడీవో త్రివిక్రమరావు, పాఠశాల చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలను అడ్డుకుందామని ప్రమాణం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు - పరమాల పల్లి పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రేమలత - నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న కస్తూరయ్య

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గౌతమి, సుబ్రహ్మణ్యం



వరదయ్యపాళెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల అండర్-17లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.గౌతమి, బాలుర జట్టు అండర్-14లో ఎం.సుబ్రహ్మణ్యం ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. భువనేశ్వర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్య వహిస్తుందని వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్, ప్రధానోపాధ్యాయులు జయసుధ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని అరిగిలకండ్రిగలోని అరంతీయవాడ, గిరిజన కాలనీవాసులకు సీజనల్ వ్యాధులు తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటర్ చర్చ్ సర్వీస్ అసోసియేషన్ ఏపీ కోర్డినేటర్ విజయకుమారి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు ఎమ్మెల్యే సుధీర్ సముచిత స్థానం కల్పిస్తున్నారని టీడీపీ నాయకులు వెంకటాచలం, కన్నలి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి,ప్రసాద్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పీఆర్ అతిథిగృహం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన చలపతిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనపర్తి గ్రామానికి చెందిన దళిత సామాన్య కార్యకర్త చలపతికి పదవి దక్కడం సంతోషకర మన్నారు.

కోవనూరు మాజీ సర్పంచ్ మృతి

కేవీబీపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు గ్రామ మాజీ సర్పంచ్ మాయాబజార్(68) శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అయన గత ప్రభుత్వ హయాంలో మార్కెటింగ్ డైరెక్టర్‌గా, కొంతకాలం డీలర్‌గా పనిచేశారు. ప్రస్తుత సర్పంచ్‌గా ఉన్న పెంచలయ్యకు పెద్ద నాన్న. ఈయన మృతి విషయం తెలుసుకున్న నాయకులు పార్టీల కతీతంగా నివాళులర్పించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్, గవర్ల కృష్ణయ్య, మాధవిరెడ్డి, గిరిబాబు సహా టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, గోపీనాథ్‌రెడ్డి నివాళులర్పించారు.

ప్రజలను ఆదుకుంటాం


నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీలో డీఎస్పీ తదితరులు

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు కష్టాల్లో ఉన్నపుడు ఆదుకోవడం పోలీసుల కర్తవ్యం అని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నచ్చనేరి, వెంటకపాళెం, చింతలపాళెం, కోబాక మిట్ట, మేర్లపాక, కందాడ, బత్తినయ్యకాలనీ, ముసలిపేడు, గోవిందవరంలలో 131 గిరిజన కుటుంబాలు తుఫాన్ ప్రభావంతో నష్టపోయినట్టు గుర్తించారు. ఆయా గిరిజనకాలనీల్లో ఎన్జీవో సంస్థలతో కలిసి నిత్యావసరాలు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పీఎస్ఐ ఇమాం, ఏఎస్ఐ ధర్మసింగ్, ఆషా స్వచ్ఛంద సంస్థ అధినేత జూలియన్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు కొనసాగిన సాయం



కేవీబీపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల రాయల చెరువు కట్ట తెగి ముంపునకు గురైన కళత్తూరు బాధితులకు సాయం కొనసాగుతోంది. కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వద్ద, తన స్నేహితుల నుంచి విరాళాలు పోగు చేసి ఆ గ్రామానికి చెందిన జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రైస్‌కుక్కర్లు, స్టీల్‌బిందెలను శుక్రవారం అందజేశారు. ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉనికి కోసమే జగన్‌రెడ్డి ఫేక్ ప్రచారాలు'

శ్రీకాళహస్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తన కోసం, తన పార్టీ ఉనికి కోసమే మాజీ సీఎం జగన్ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నెలకోసారి చార్టెడ్ విమానంలో వచ్చి ఎంపిక చేసుకున్న విలేకరులతో ప్రజలకు పనికి వచ్చే ఒక మాట కూడా మాట్లాడడన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కుట్రలు చేయడమే ఆయన నైజమన్నారు. పిన్నెల్లి, జోగి రమేష్ వంటి వారిని గాంధేయవాదులుగా చూపడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చేసే ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్‌ను అమలు చేసి చిత్తశుద్ధిని చాటారన్నారు.

తిరుపతి జిల్లా అర్చక సిబ్బంది జేఏసీ

ఏర్పేడు,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బంది, భజంత్రీలు పాపానాయుడుపేట ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం సమావేశమై నూతన జేఏసీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆకుల సతీష్(భారతీయ మజ్దూర్ సంఘ అధ్యక్షుడు), అధ్యక్షుడిగా వంశీకృష్ణశర్మ (గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ అర్చకుడు), ఉపాధ్యక్షుడిగా మణి(పాకాల), ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, జాయింట్ సెక్రటరీగా డిల్లీ(ఆంజనేయపురం), కోశాధికారిగా బాలాజీ(బుగ్గమఠం), ఈసీ మెంబర్లుగా సేతు కుమార్ లోకేష్, మధు, లలిత, మణి, వరప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు. గుడిమల్లం ఆలయ ఈవో రామచంద్రారెడ్డి వారిని అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి

ఏర్పేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం ఎస్టీకాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఏర్పేడు పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన జానకిరామయ్య శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలో ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా ఏర్పేడు మండలం గోవిందవరం ఎస్టీకాలనీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా జానకిరామయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తెకు ఇటీవల వివాహం కాగా చిన్నకుమార్తె 8వ తరగతి చదువుతోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.